క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఇర్ఫాన్ తెలిపారు. 132 కేవీ నూతన లైన్ నిర్మాణం కోసం పనులు కొనసాగుతున్నందున అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: కౌటాల –లోనవెల్లి విద్యుత్ ఫీడర్ లైన్‌లో 132 కేవీ టవర్‌లైన్ పనులు శనివారం చేపట్టనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ శుక్రవారం తెలిపారు. టవర్ లైన్ పనుల కారణంగా శనివారం కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 6 గంటల వరకు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యంతో పోలీసులు

బెజ్జూర్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి ఇంట్లో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం శుక్రవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఏడు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన బైక్



ప్రమాదంలో గాయపడిన తిరుపతి

ఆసిఫాబాద్‌రూరల్: ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొనగా ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రహపల్లి గ్రామానికి చెందిన పిడుగు తిరుపతి ఆసిఫాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో బూర్గుడ గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న పిడుగు తిరుపతి కాలు విరిగిపోయింది. స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆయనను తరలించారు.

నేడు సేవాలాల్ జయంతి

లింగాపూర్: మండల కేంద్రంలోని జగదాంబ దేవి ఆలయంలో శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్న సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి, భోగ్ భండార్ కార్యక్రమానికి వివిధ గ్రామాల ప్రజలు హాజరుకావాలని గ్రామ నాయక్ కిరణ్‌రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున మండలవాసులు, భక్తులు, మహరాజ్ మండలి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

ఇంటి పన్ను వసూళ్లపై నజర్

- లక్ష్యం రూ.37.54 లక్షలు
- నేటి వరకు వసూలు రూ.27.97 లక్షలు
- గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరులు. మార్చిలోపు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు పంచాయతీ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలోని 2024 –25 సంవత్సరానికి నిర్దేశించిన ఇంటి పన్నుల లక్ష్యాన్ని అధిగమించేందుకు గ్రామస్థాయి అధికారులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. గతంలో మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా పునర్విభజనలో 26 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 80 శాతం ఇంటి పన్నులు వసూలు చేశారు. 26 గ్రామ పంచాయతీల్లో మొత్తం రూ.37. 54 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.27. 97లక్షలు వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన మార్చి వరకు వసూలు చేసి 100 శాతం పూర్తి చేస్తామని చెబుతున్నారు.

వేగంగా వసూళ్లు..



మోతుగూడలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

డిసెంబర్ నుంచి మండల వ్యాప్తంగా పన్నుల వసూలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయాన్నే గ్రామాలకు చేరుకుని ఇంటింటికీ తిరుగుతూ యజమానులు పన్నులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. డీఎల్‌పీవో, ఎంపీవో ఆకస్మిక తనిఖీలు, సమీక్ష సమావేశాల్లో వందశాతం పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఎంపీవో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు మార్చి లోపు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతున్నారు.

4 పంచాయతీల్లో నూరు శాతం..

మండలంలోని 26 గ్రామ పంచాయతీలు కలిపి మొత్తంగా 80 శాతం పన్నులు వసూలు చేశారు. కాగా 4 గ్రామ పంచాయతీల్లో 100శాతం ఇంటి పన్నులు వసూలు చేశారు. 10 గ్రామ పంచాయతీల్లో 80 శాతం వరకు వసూలు చేశారు. అడ దస్నాపూర్, తుంపెలి, చిలాటిగూడ, వావుదాం గ్రామ పంచాయతీల్లో వంద శాతం పూర్తి చేశారు. మోతుగూడ, గోవింద్‌పూర్, కోసార, కౌటాల, మానిక్‌గూడ, మోవాడ్, రౌటసంకేపల్లి, సాలేగూడ, తుంపెల్లి, ఎల్లారం గ్రామ పంచాయతీల్లో 75 నుంచి 80శాతం వరకు పూర్తి చేశారు. మిగతా 14 గ్రామ పంచాయతీల్లో 65 నుంచి నుంచి 70 శాతం వరకు వసూలు చేశారు. మార్చి నెల పూర్తయ్యేలోగా 26 గ్రామ పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు 13 గ్రామ పంచాయతీల్లో 90 నుంచి 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. మిగితా 13 జీపీల్లో 70 శాతం వరకు పన్నులు వసూలయ్యాయి. మార్చి 20 లోగా లక్ష్యాన్ని చేరుకుంటాం.

– మౌనిక, ఎంపీవో

కార్మిక కుటుంబాలకు తాగునీరు సరఫరా చేయాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో నివాసం ఉండే కార్మిక కుటుంబాలకు మంచినీరు అందించాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. ఈమేరకు శుక్రవారం గోలేటిలో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం గోలేటిలోని ఫిల్టర్ బెడ్ నుంచి కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తున్న నీరు కార్మిక కుటుంబాలకు తాగేందుకు ఏమాత్రం అనుకూలంగా ఉండటం లేదన్నారు. ఫిల్టర్ బెడ్‌లో నీటిని సరిగా శుద్ధి చేయకుండా మురికి నీటినే కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తున్నారని, దాంతో కార్మిక కుటుంబాలు చర్మ వ్యాధులు, విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. తాగునీటి విషయంలో కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతూ కలుషిత నీటిని తాగుతూ అనారోగ్యాల బారిన పడుతున్నా గుర్తింపు సంఘం నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

యాజమాన్యం కార్మికులు, కార్మిక కుటుంబాల సంక్షేమానికి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూష్, టెక్నిషియన్స్ ఏరియా ఆర్గనైజర్ రాజు, బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని బాలేపల్లి గ్రామంలో ఈ నెల 17 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జగన్, సాగర్, అనిల్ శుక్రవారం తెలిపారు. స్థానిక భారతరత్న స్టేడియంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.1100 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6300570550, 6300108308 లో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు లేక అవస్థలు



ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు(ఫైల్)

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు
- మహారాష్ట్రకు బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకోలు

కౌటాల: 'ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి.. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం' అంటూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు చెబుతూనే ఉంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రయాణికులకు కావాల్సిన ఆర్టీసీ బస్సు సౌకర్యం మాత్రం కల్పించడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల మండలానికి సరిహద్దు రాష్ట్రం మహారాష్ట్రలోని గ్రామాలకు మండల కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) –మాకిడి గ్రామాల మీదుగా మహారాష్ట్రలోని వీరూర్, రాజూరా, బలార్షా, చంద్రపూర్ పట్టణాలకు మండలం నుంచి ప్రతీరోజు అధిక సంఖ్యలో ప్రజలు, వ్యాపారులు, రైతులు ప్రయాణాలు సాగిస్తుంటారు.

ఆర్టీసీ సౌకర్యమేది..?

మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఎంతో మంది ప్రజలు మహారాష్ట్రకు వెళ్తుంటారు. మహారాష్ట్రలోని పలు గ్రామాలకు మండలవాసులకు బంధుత్వాలు ఉండడంతో నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాగే పలు పనుల నిమిత్తం వ్యాపారులు, రైతులు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. కానీ మహారాష్ట్రకు వెళ్లడానికి మండల కేంద్రం నుంచి మహారాష్ట్రకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సరిహద్దు గ్రామాల్లోని పలువురు ప్రజలు ప్రాణహిత, వార్ధా నదుల్లో నాటు పడవల్లో ప్రయాణించి మహారాష్ట్ర చేరుకుంటున్నారు. మహారాష్ట్రకు కౌటాల నుంచి బస్సు సౌకర్యం ఉంటే ప్రమాదకరమైన నాటు పడవ ప్రయాణం తమకు తప్పుతుందని పేర్కొంటున్నారు. గతంలో కౌటాల నుంచి మహారాష్ట్రకు ఉన్న ఆర్టీసీ బస్సు సేవలను నిలిపివేయడంతో తమకు తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.

ఇబ్బందుల్లో ప్రయాణికులు..

మహారాష్ట్రలోని ఆయా పట్టణాలకు వెళ్లేందుకు కౌటాల నుంచి ఆర్టీసీ బస్సు వసతి లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు వాహనాల ద్వార రాకపోకలు సాగిస్తున్నారు. మండల ప్రజలతో పాటు బెజ్జూర్ మండల ప్రజలు ఈ రోడ్డు గుండా ప్రయాణాలు చేస్తున్నారు. ప్రతీరోజు ఉదయం సిర్పూర్(టి) మండల కేంద్రం నుంచి రైలు సౌకర్యం ఉండగా మండల వాసులు ఉదయం రైలులో మహారాష్ట్రకు వెళ్తున్నారు. రైలులో వెళ్లలేని ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో అధిక ధరలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నాతధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కౌటాల నుంచి మహారాష్ట్రకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం

మండల కేంద్రం నుంచి ప్రతీరోజు ఎంతో మంది మహారాష్ట్రకు వెళ్తుంటారు. రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. ప్రైవేట్ వాహనాల్లో సురక్షితమైన ప్రయాణం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– శివకుమార్, కౌటాల

బస్సు సౌకర్యం కల్పించాలి

మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో మా బంధువులు ఉన్నారు. వారిని చూడడానికి అప్పుడప్పుడు మహారాష్ట్రకు వెళ్తుంటాను. కానీ మహారాష్ట్రకు కౌటాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

– నారాయణ, గురుడుపేట

దుమ్ముతో తిప్పలు..!

- సిర్పూర్(టి) –కౌటాల రహదారిపై లేస్తున్న దుమ్ము, ధూళి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



దుమ్ములో ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు

సిర్పూర్(టి): మండలంలోని ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, ధూళి లేస్తుండడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో బస్టాండ్ నుంచి పేట్ మహిలా కాలనీ, డౌనల్, గోవింద్‌పూర్ కాలనీల గుండా వెళ్లే సిర్పూర్(టి) –కౌటాల ప్రధాన రహదారి గుండా నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పేట్‌మహెలా కాలనీ నుంచి గోవింద్‌పూర్ కాలనీ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణాలు సాగించే భారీ వాహనాల వల్ల ద్విచక్రవాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో వేంపల్లి రైల్వేలైన్‌పై నూతనంగా నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తికాకుండానే వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఫ్లెఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో భారీ వాహనాలతో దుమ్ము, ధూళి విపరీతంగా వస్తుంది. దీంతో ఈ రహదారి గుండా ప్రతిరోజు ప్రయాణాలు సాగించే ద్విచక్రవాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభం నుంచి వంతెన దాటే వరకు పూర్తిగా దుమ్ము లేచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు సంవత్సరానికి పైగా వెంతనపై నుంచి వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నా వంతెన అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు మాత్రం సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టడంలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వంతెనకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు పనులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి డౌనల్, గోవింద్‌పూర్ కాలనీల వరకు నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వాహనదారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న వేంపల్లి రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జి వద్ద భారీ వాహనాలతో వస్తున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఏళ్లుగా ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

– షబ్బీర్‌అలీ, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో భారీ వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వేంపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులతో పాటు నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– గణేశ్, సిర్పూర్(టి)

బాధితురాలికి ఆర్థిక సహాయం



విరాళాలు సేకరిస్తున్న ఆదివాసీ నాయకులు

కెరమెరి: బ్రేన్ క్యాన్సర్‌తో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి ఆర్థిక సహాయం చేసి తమ ఉదారత చాటుకున్నారు ఆదివాసీ నాయకులు. తిర్యాణి మండలంలోని గడెల్‌పల్లి గ్రామ పంచాయతీ రాళ్లకన్నెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మడావి గుణవంత్‌రావు సతీమణి పద్మ బ్రేన్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే లక్షల్లో ఖర్చు చేసిన కుటుంబం దాతల సాయం కోసం ఎదురు చూస్తుండగా కెరమెరి మండలానికి చెందిన ఆదివాసీ సంఘాల నాయకులు శుక్రవారం విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 20,000లను బాధిత కుటుంబాని కి ఫోన్‌పే ద్వారా చెల్లించారు. నాయకులు మడావి భరత్, పెందోర్ మోతిరాం, తొడోసం జగన్నాథ్‌రావు, సెడ్మకి తుకారాం, తుల్సీరాం, ఆదే నారాయణ సోము, సిడాం భీంరావు తదితరులు ఉన్నారు.

'నిత్యం ప్రజలకు సేవ చేస్తా'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప



హాజరైన కార్యకర్తలు

కౌటాల: సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు నిత్యం సేవ చేయడమే తన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలో కోనేరు అభిమానులు, కార్యకర్తల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినా, గెలిచినానా సిర్పూర్ ప్రజలకు తోచినంత సాయం చేస్తానన్నారు. కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరినట్లు స్పష్టం చేశారు. తన వెంటే పదేళ్ల పాటు ఉండి కొందరు స్వార్థపరుల కుట్రలతో ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయానని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కోనేరు అభిమానులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చిన కోనేరు కుటుంబీకుల దృష్టికి తీసుకొని రావాలని, సిర్పూర్‌కు ఎంతో రుణపడి ఉన్నామని తెలిపారు. నాయకులు కుమురం మాంతయ్య, బోయర్ రాధేశ్యాం, వెంకన్న, మధుకర్, వసంత్‌రావు, బ్రహ్మయ్య, నాజీం, మనీష్, దామోదర్, ఆనంద్‌రావ్, ఆగయ్య తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ తలపెట్టిన వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్,, యాసం నర్సింగ్ రావ్, విజ్జగిరి నారాయణ, అలాల్ అజయ్, సాజిదోద్దీన్, పాల్గొన్నారు.

నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న పీడీ బసవేశ్వర్

తాంసి: జిల్లాలోని ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ బసవేశ్వర్ అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలో నమూనా భవన నిర్మాణ పనులు అధికారులతో కలిసి ప్రారంభించారు. భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే మూడు మండలాల్లో పనులు ప్రారంభించినట్లు వివరించారు. పీడీ వెంట డీఈ శంకర్, ఏఈ నజీర్, సిబ్బంది ఉన్నారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్‌రూరల్: నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. నాయకులు ఖయ్యుం, సామ ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

లింగాపూర్: మండలంలోని వంజారీగూడ, పిక్లాతండా గ్రామాల్లో శుక్రవారం వన్యప్రాణుల సంరక్షణపై గ్రామ ప్రజలకు జోడేన్‌ఘాట్ ఫారెస్ట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణులను వేటాడినా, అడవులను నరికినా, పంట పొలాల్లో విద్యుత్ తీగలను అమర్చినా, అనుమతులు లేకుండా పాత కర్రలను వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ అధికారి అనూష, మహేశ్, హరిత, భగవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.